క్లుప్తంగా

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



జడ్చర్ల టౌన్: న్యాయమూర్తి గవాయ్‌పై న్యాయవాది దాడిచేయడాన్ని ఖండిస్తూ మంగళవారం జడ్చర్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జికి వినతి పత్రం అందజేశారు. న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలిక్‌షాకీర్ ప్రకటించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జంగయ్య, విశ్వేశ్వర్, మహేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాహితిరెడ్డి, ప్రశాంత్, ఇఫ్తెకార్, కరీం, మురళీకృష్ణ, పురుషోత్తం, రాములు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



నవాబుపేట: ఎన్నికల విషయంలో అధికారులు తమ విధులపై సిద్ధంగా ఉండాలని మండల స్పెషల్ అధికారి సునీత సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు సంబంధించి ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోడల్ కోడ్ కండక్ట్ అధికారి తహసీల్దార్ శ్రీనివాస్ సూచనల మేరకు విధులపై సమావేశాలు నిర్వహించాలని అలాగే జూమ్ సమావేశాల్లో హాజరుకావాలని సూచించారు. కాగా ఎన్నికల వ్యవహారాలు ఎలా ఉన్న సిబ్బంది మాత్రం సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంఈఓ నాగ్యానాయక్, జీహెచ్‌ఎం దరశరత్‌నాయక్, నరేశ్, రాజరాజేశ్వరి తదితరులు ఉన్నారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన కారు

జడ్చర్ల: మండలంలోని గొల్లపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై గొర్రెల మందపైకి ఓ కారు దూసుకెళ్లడంతో 16 గొర్రెలు మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ధన్వాడ మండలం యనన్‌పల్లికి చెందిన మహేశ్ తన గొర్రెల మందను రోడ్డు దాటిస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి జడ్చర్ల వైపునకు వస్తున్న ఓ కారు అదుపు తప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ప్రమాదంపై విచారించి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

జడ్చర్ల: మండలంలోని అమ్మపల్లికి చెందిన బండారీ రమేశ్(32) కనిపించకుండా పోయాడని భార్య జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. గతనెల 25న బొలేరోను తీసుకుని కిరాయికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన తన భర్త తిరిగి ఇంటికి రాలేదని, ఫోన్ స్విచ్చాఫ్ వస్తుందని ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

ఎక్వాయపల్లిలో యువతి

జడ్చర్ల: మండలంలోని ఎక్వాయపల్లికి చెందిన యువతి అఖిల(18) మంగళవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయిందని తండ్రి వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.



కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి



ఎస్పీ కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎస్పీ జానకి

వాల్మీకి చరిత్రను అందించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి
- ఊరూరా శోభాయాత్రలు, ప్రత్యేక పూజలు

సాక్షి, నెట్‌వర్క్: నేటి తరానికి మహర్షి వాల్మీకి చరిత్రను అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. వాల్మీ కి జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూ లమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి ఇందిర, డీపీఓ పార్థసారధి, కలెక్టరేట్ ఏఓ సువర్ణరాజ్, బాలుయాదవ్ పాల్గొన్నారు.

❁ పీయూ అడ్మినిస్ట్రేషన్ భవనంలో వాల్మీకి చిత్రపటానికి వీసీ శ్రీనివాస్ పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, కంట్రోలర్ ప్రవీణ, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రవికాంత్, అర్జున్‌కుమార్, రాజశేకర్, రవికుమార్, జ్ఞానేశ్వర్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శ కవి వాల్మీకి

❁ వాల్మీకి మహర్షి దేశానికి ఆదర్శమైన కవి, ఆధ్యాత్మిక గురువుగా నిలిచారని ఎస్పీ జానకి తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీలు రమణారెడ్డి, శ్రీనివాసులు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

❁ జడ్చర్ల మండలంలోని మాచారంలో విగ్రహానికి వాల్మీకులు పూలమాల వేసి పూజలు చేశారు.



మాచారంలో వాల్మీకి జయంతిలో పాల్గొన్న బోయ కులస్తులు

కార్యక్రమంలో బాలకృష్ణ, తిరుపతయ్య, వెంకటయ్య, రవి, సుదర్శన్, చెన్నయ్య, శాతయ్య పాల్గొన్నారు. మున్సిపాలిటీలోని 17వ వార్డులో వాల్మీకి చిత్రపటం ఏర్పాటు చేసి వార్డు కౌన్సిలర్ చైతన్య పూలమాల వేసి పూజలు చేశారు.

❁ దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వాల్మీకి చిత్రపటానికి పలువురు వాల్మీకి సంఘం ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, సంతోష్, విష్ణు, శ్రీకాంత్, శివకుమార్, శ్రీను, మధు, బీఆర్‌ఎస్ నాయకులు జెట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, ఆంజనేయులు, సత్యంసాగర్, చల్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

❁ భూత్పూర్ మండలంలోని కొప్పొటలో నిర్వహించిన వాల్మీకి జయంతికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి హాజరై విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో భూపతిరెడ్డి, మాసగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కిట్టురెడ్డి, శ్రీనివాసులు, సంజీవరెడ్డి, హర్యానాయక్, కొండయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

❁ మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని చౌదర్‌పల్లిలో వాల్మీకి రైతు సంఘం ఆధ్వర్యంలో రామాలయంలో వాల్మీకి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్‌లోవాల్మీకి చిత్రపటాన్ని ఉంచి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కుర్మయ్య, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు రంగయ్య, వాల్మీకి రైతు సంఘం నాయకులు చెన్నకేశవులు, కొండయ్య, కుర్మయ్య, వెంకటయ్య, బాల్‌చెన్నయ్య, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



చౌదర్‌పల్లిలో శోభాయాత్రలో పాల్గొన్న వాల్మీకి రైతు సంఘం నాయకులు

❁ చిన్న చింతకుంట మండలకేంద్రానికి చెందిన వాల్మీకి సంఘం నాయకులు జూరాల ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను తీసుకొచ్చి మహర్షి విగ్రహానికి జలాభిషేకం చేశారు.

❁ మూసాపేట, జానంపేట, అచ్చాయపల్లి, అడ్డాకుల, పొన్నకల్ తదితర గ్రామాల్లో వాల్మీకి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి పూజలు చేశారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ విజయేందిర బోయి

అడ్డాకుల: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. అడ్డాకుల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఆస్పత్రిలో జరుగుతున్న ఆశ కార్యకర్తల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గర్భిణులపై ప్రత్యేక దృష్టిసారించి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని చెప్పారు. అనీమియా లోపం ఉన్న వారికి ప్రత్యేక చికిత్స అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై సమీక్ష చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుబాటులో ఉన్న మందుల గురించి వాకబు చేశారు. అదేవిధంగా ఆస్పత్రిలో ఉన్న లేబర్ గది, ల్యాబ్‌ను సందర్శించారు.

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి స్థానిక ఎన్నికల సన్నద్ధతపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలను అధికారులు నిష్పక్షపాతంగా నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీఓ సద్గుణ తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించని ఏజెన్సీని రద్దుచేయాలి

జడ్చర్ల టౌన్: బడ్జెట్ విడుదల అయినప్పటికీ ఆస్పత్రి కార్మికులకు వేతనాలు చెల్లించని శ్రీశాంతి ఏజెన్సీని రద్దుచేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో భోజన విరామ సమయంలో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేసి ఆర్‌ఓ హరినాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు,పారిశు ధ్య, సెక్యూరిటీ, పేషెంట్‌కేర్, సూపర్‌వైజర్ కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న శ్రీశాంతి ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ విడుదల అయినప్పటికీ దసరా పండగకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు.

పడకల తగ్గింపును ఉపసంహరించాలి

ఏరియా ఆస్పత్రి అంటూ 100పడకలకు బదులుగా 83పడకలు చేశారని, దానిని ఇప్పుడు 50పడకలకు కుదింపు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సురేశ్ డిమాండ్ చేశారు. ఏప్రిల్ 1నుంచి 50పడకల సామర్థ్యానికి తగ్గిస్తూ వేతన బడ్జెట్ విడుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కార్మికులు 6నెలల వేతనాలు కోల్పోవడంతో పాటు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. తక్షణమే కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి ఆస్పత్రి పడకల సామర్థ్యం తగ్గకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి కార్మికులు నర్సింహులు, నవీన్, రామకృష్ణ, రవీందర్, శేఖర్, మణెమ్మ, పద్మ, భార్గవి, నీరజ, చెన్నమ్మ, నర్సమ్మ, స్వాతి, అంజలి, మంగమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.



ఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

ఫారెస్ట్ అధికారులపై ఆగ్రహం

నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండకు ఇటీవల నిర్మించిన డబల్ రోడ్డు పక్కన మొక్కలు నాటేందుకు ఫారెస్ట్ అధికారులు రహదారిని ధ్వంసం చేయడం పట్ల సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీబీని ఇష్టారీతిగా రోడ్డుపై నడుపుతూ మొత్తం గుంతలు పడే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడ్డారు. మొక్కలు నాటే ప్రక్రియను నిలుపుదల చేసి ఆర్ అండ్ బీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



అడ్డాకుల: మండలంలోని చిన్నమునుగల్‌ఛేడ్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు రాముగౌడ్ మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం మాజీ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. రాముగౌడ్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద మండడి మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేణుయాదవ్, చంద్రమోహన్‌రెడ్డి, గణేశ్, చంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

దేవరకద్ర: మున్సిపాలిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరం విజయవంతమైంది. హైదరాబాద్ మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో దేవరకద్ర ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమున్న వారిని బుధవారం ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు తరలించి శస్త్రచికిత్సలు చేయిస్తామని వైద్యులు తెలిపారు. క్యాంపు ఆర్గనైజర్స్ ఓబుల్‌రెడ్డి, వినేశ్, వైద్యనిపుణులు వరుణ్, శ్రీనాథ్, రుహీ, శివ, రితుజా, వైష్ణవి, వాల్మీకి సంఘం ప్రతినిధులు హరికృష్ణ, సంతోష్, విష్ణు, శ్రీకాంత్, శివకుమార్, శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులకు గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కొడుకులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇబ్రహీం భార్య, పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. గ్రామంలో గ్యార్వీ పండుగను జరుపుకోవడానికి ఇటీవల గ్రామానికి వచ్చాడు. మంగళవారం మూసాపేటలో జరిగే వారాంతపు కూరగాయల సంతలో కూరగాయాలు తెచ్చుకునేందుకు ద్విచక్రవాహనంపై 8వ తరగతి చదివే కుమారుడు ముజాయిద్‌ను ఎక్కించుకుని వెళ్లాడు. స్థానిక గ్లాస్ కంపెనీ సమీపంలో మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ నేరుగా ద్విచక్రవాహనానికి తగిలింది. దీంతో బైక్‌పై ఉన్న తండ్రీ, కొడుకు కిందపడ్డారు. ఈ ఘటనలో ఇబ్రహీంకు తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడు ముజాయిద్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఫంక్చర్ షాపులో చోరీ

అడ్డాకుల: మండలంలోని కాటవరం శివారులోని పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న ఫంక్చర్ షాపులో చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన నరేశ్ పాశ్వాన్ సుమారు 15ఏళ్లుగా ఫంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. అలాగే పాత టైర్లను కొనుగోలు చేసి విక్రయించేవాడు. ఈ క్రమంలో ఇటీవల దసరా పండగకు స్వగ్రామానికి వెళ్తూ షాపులో ఉన్న ఇనుప పెట్టెలో సుమారు రూ.90వేల నగదును పెట్టి వెళ్లాడు. తర్వాత పెట్టె కనిపించక పోవడంతో అందులో పనిచేసే పిల్లలు యాజమానికి సమాచారం చేరవేశారు. మంగళవారం ఇక్కడికి చేరుకున్న నరేశ్ పాశ్వాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అడ్డాకుల సమీపంలో రహదారి పక్కన పొలంలో పెట్టె కనిపించినట్లు తెలిసింది. అందులో డబ్బులు లేకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్ట్రో ల్యాబ్ ఏర్పాటుపై శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: త్వరలో ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించనున్న ఆస్ట్రో ల్యాబ్‌కు సంబంధించిన ఫిజిక్సు ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని మాడల్ బేసిక్ పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆస్ట్రో ల్యాబ్ రీసోర్సు పర్సన్ మిశ్రా ల్యాబ్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. 42 రకాల ప్రయోగాలు, నక్షత్రాలు, గ్రహాలు తదితర అంశాల కోసం ల్యాబ్‌ను వినియోగించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్, ఏఎంఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికే స్థానిక ఎన్నికల్లో అవకాశం

మిడ్జిల్: కాంగ్రెస్ పార్టీకి పదేళ్ల నుంచి కష్టపడుతున్న కార్యకర్తలకే స్థానిక ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ అవకాశం ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్థానిక ఎన్నికల్లో పార్టీకి కష్టపడిన కార్యకర్తలలో ప్రతి ఎంపీటీసీ నుంచి మూడుపేర్లు సూచించాలని, అలాగే జెడ్పీటీసీకి ముగ్గు రు పేర్లు సూచించాలని వివరించినట్లు పేర్కొ న్నారని.. ఆయన సూచన మేరకు వలసవాదులకు టికెట్స్ ఇవ్వడం సాధ్యం కాదని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు పుకార్లు నమ్మవద్దని, పార్టీ అభివృద్ధికి కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఎమ్మెల్యే న్యాయం చేస్తారని ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లో అవకాశం కల్పించడం జరుగదని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో మండలం అన్నిరంగాల్లో అభివృద్ధి జరుగుతుందని, ఇతరులు ఇక్కడ పోటీ చేసే అవకాశం లేదని వారు తెలిపారు. మండలంలో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచే అభ్యర్థులకు సీట్లు ఇస్తుందని, ఎవరు నిరుత్సాహం చెందవద్దని పార్టీ మండలాధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి తెలిపారు.

భగీరథ పైపులైన్‌కు మరమ్మతు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని మెయిన్ రోడ్డు (ఎన్‌హెచ్–167) పై షాషాబ్ గుట్ట మలుపు వద్ద, రాంరెడ్డిగూడెం వద్ద పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీలను మరమ్మతు చేస్తున్నామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం వరకు మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

చిన్ననాటినుంచే ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

జడ్చర్ల టౌన్: ప్రతిఒక్కరూ చిన్నప్పటినుంచే ఆధ్యాత్మికతను అలవర్చుకునేలా తల్లిదండ్రులు కృషిచేయాలని ప్రకాశం జిల్లా సిద్దేశ్వరం సిద్ధ జ్ఞాన ఆశ్రమం పీఠాధిపతి శ్రీశుద్ధ చైతన్యానందగిరిస్వామి సత్సంగం చేశారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో హన్మంత్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సత్సంగంలో ఆయన పాల్గొని సందేశమిచ్చారు. వృద్ధాప్యం వచ్చాక భక్తిమార్గంలోకి వెళ్లవచ్చనే భావన చాలామందిలో ఉందని, ప్రతి తల్లిదండ్రిలోనూ అదేభావన నెలకొందన్నారు. అది తప్పని, చిన్నప్పటినుంచే ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయించడంతో వృద్ధాప్యంలో మరింత భక్తిభావంతో దేవుడికి అతి సమీపంలో ఉండగలుగుతామన్నారు. ఆధ్యాత్మికత వైపు పయనించడంతో సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. అనంతరం సత్సంగంలో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో విష్ణుసహస్రనామ పారాయణం గావించారు.

నేడు బస్వాయపల్లికి చైతన్యానంద స్వామి

దేవరకద్ర: మండలంలోని బస్వాయపల్లిలో సైలెంట్ వ్యాలీ ధ్యాన కేంద్రానికి బుధవారం శుద్ధ చైతన్యానంద స్వామి రానున్నారని పిరమిడ్ ధ్యానకేంద్రం ప్రతినిధి పారిజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు సైలెంట్ వ్యాలీ కార్యక్రమం ఉంటుందని ధ్యాన ప్రతినిధులు ఉదయం 8:30 గంటలకే రావాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌కు క్లబ్ భవనం పంచాయితీ



మహమ్మదాబాద్: గ్రామంలో 40ఏళ్ల కిందట క్లబ్ భవనం కోసం రాసిచ్చిన స్థలాన్ని మళ్లీ వాళ్ల వారసులే ఇతరులకు అమ్ముకున్నారంటూ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఐదారు నెలలుగా ఈ సమస్య గ్రామస్తులు, యువకులకు స్థలదాతకు మధ్య వివాదం కొనసాగుతున్నది. దీంతో ఇటీవల స్థలదాత ఇతర వ్యక్తులకు అమ్మడంతో వారు ఆ స్థలంలో ఉన్న భవనాన్ని కూల్చివేసి సొంత ఇల్లు నిర్మించుకునేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులంతా యువకులు, మహిళలు మంగళవారం ఆ స్థలంలో మొక్కలు నాటడంతో పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాజేశ్వర్ ప్రజలతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న స్థలదాత దగ్గరకు వెళ్లారు. ప్రజలకు ఆయనకు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ స్థలంలో కాకుండా వేరే స్థలాన్ని గ్రామస్తులకు ఇస్తానని హామీ ఇచ్చినా ప్రజలు ఒప్పుకోలేదు. 40ఏళ్ల కిందట రూ.1450కి కొనుగోలు చేసినట్టు ఆధారాలు ఉన్నాయని రఘునాథ్‌రెడ్డి అనే వ్యక్తి 31ఎకరాలు గ్రామకంఠంలో విలీనం చేసినట్టు తీర్మానం చేశారని గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. ధరణి లోపంతో మళ్లీ కబ్జా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అలాంటి స్థలంపై తనకు పూర్తి హక్కు లు ఉన్నాయని కావాలంటే కోర్టుకెళ్లి తేల్చుకోవచ్చని స్థల యజమాని ప్రదీప్‌రెడ్డి తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపునకు కృషిచేయాలి

భూత్పూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచినట్లయితే స్థానికంగా బీజేపీ బలోపేతంతోపాటు గుర్తింపు ఉంటుందన్నారు. దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో కృషి చేసినట్లు, స్థానికంగా మీరు పోటీ చేస్తే గెలిచే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు గాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, రాజగోపాల్‌రెడ్డి, ఫారూఖ్, రాజశేఖర్, భరత్ భూషణ, కాషస్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

'సీజేఐపై దాడి దేశ చరిత్రలోనే చీకటిరోజు'



అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: సనాతన ధర్మం ముసుగులో దేశ అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీం కోర్టులోనే సీజేఐ గవాయ్‌పై భౌతిక దాడికి పాల్పడటం దేశ చరిత్రలోనే చీకటిరోజని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు, కార్యదర్శి కుర్మయ్య పేర్కొన్నారు. సీజేఐపై మత ఉగ్రవాది రాకేశ్ కిశోర్ అనే న్యాయవాది తన బూటు విసిరి దాడికి పాల్పడటాన్ని ఖండిస్తూ మంగళవారం అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి ఆది విష్ణువర్ధన్, నాయకులు మనోహర్, నాగరాజు, పాపగళ్ల నాగరాజు, ఉదయ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సీజేఐ గవాయ్‌పై న్యాయవాదే దాడికి పాల్పడటం గర్హనీయమని బీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన న్యాయ, ప్రజాస్వామ్య వ్యవస్థలపై జరిగిన దాడి గా పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజ్యాంగంపై దాడిగా భావిస్తున్నాం

మహబూబ్‌నగర్ రూరల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నాన్ని రాజ్యాంగంపై దాడిగా భావిస్తున్నామని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య అన్నారు. మంగళవారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు గోపాల్, వెంకటేశ్, రాములు, శ్యామ్‌సుందర్, మాసయ్య, శివకుమార్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి పెను ముప్పు అని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు అన్నారు. జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నాన్ని ఖండిస్తూ టీఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్సింహులు, విద్యావతి, కొత్త నర్సింహులు, శివకుమార్, అంజి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని ఖండించాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సీజేఐ గవాయ్‌పై దాడి చేసిన వారిని ఖఠినంగా శిక్షించాలని డీవైఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అక్షర కళాశాల వద్ద దాడికి నిరసనగా ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల నిరసన

సీజేఐపై దాడిని ఖండిస్తూ తెలంగాణ చౌరస్తాలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భరత్, శ్రీనాథ్, రమేశ్, నందు, సాయి, శివ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల నిరసన

పాలమూరు: సీజేఐపై దాడిని ఖండిస్తూ మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శించారు. సందర్భంగా పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ ఈ దాడి ప్రజాస్వామ్య విలువలపై రాజ్యాంగంపై, న్యాయవ్యవస్థపై దళితులపై చేసిన దాడిగా అభివర్ణిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు ఫారూఖ్ హుస్సేన్, హనీఫ్ అహ్మద్, లక్ష్మీకాంత్, తిమ్మప్ప, శ్రీశైలం, వామన్‌కుమార్, చెన్నయ్య, సుదర్శన్, అజయ్, రవిబాబు, కేసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.